సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



ఏసీబీకి చిక్కిన ఏఈ
ఆలేరు పంచాయతీరాజ్ ఏఈ కొండేటి రమేష్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. - 8లో



బిల్లులు చెల్లించాలి
బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. - 9లో



ఆదాయం రూ.కోటి 69లక్షలు
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన నగదు, నగలును లెక్కించారు. - 10లో

న్యూస్‌రీల్

నారసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. నిత్యకల్యాణ వేడుకను ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో చేపట్టారు. అంతకు ముందు వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి, తులసీ దళాలతో అర్చించారు. అలాగే ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలు నిర్వహించి స్వామివారి సేవను మాఢవీధిలో ఊరేగించారు.

దండుమల్కాపురం సర్పంచ్‌కు అవార్డు



సర్పంచ్ యాదగిరికి ఎంపిక పత్రం అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం సర్పంచ్ ఎలువర్తి యాదగిరికి బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్‌ఏ) జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు ప్రకటించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆయనకు బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈనెల 15న ఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నాలుగో నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా అవార్డును ప్రధానం చేయనున్నారు. అవార్డు రావడం పట్ల సర్పంచ్ యాదగిరి హర్షం వ్యక్తం చేశారు.

అబ్దుల్ కలామ్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు పోచంపల్లివాసి



పొందాల మహేశ్వర్

భూదాన్‌పోచంపల్లి : పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ పొండాల మహేశ్వర్ ఏపీజే కలామ్ నేషనల్ టీచింగ్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. వరంగల్‌లోని ఏడీవైఎం అండ్ వేణిశెట్టి జగదీశ్వరయ్య మెమోరియల్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న హన్మకొండలో జరిగే కార్యక్రమంలో పొండ్యాల మహేశ్వర్ అవార్డు అందుకోనున్నారు. అవార్డు రావడం పట్ల మహేశ్వర్, అతని కుటుంబ సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ ఎన్జీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టులు బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ 2, కంప్యూటర్ సైన్స్ 3, ఎకనామిక్స్ 2, హిస్టరీ 1, తెలుగు 2, జువాలజీ 2, బీబీఏ ఈ కామర్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు.

రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి



ఆర్‌ఎంకు అవార్డు అందజేస్తున్న సజ్జనార్

నల్లగొండ రూరల్ : రాఖీ, శ్రావణమాసం చాలెంజ్‌లో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్టీసీ అధిక ఆదాయం రాబట్టి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినందుకు గాను అవార్డు దక్కింది. శనివారం హైదరాబాద్‌లో నల్లగొండ ఆర్‌ఎం శ్రీదేవికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డిపో మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

అవిశ్వాసాల దారెటు?

మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్ల పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు

- అవిశ్వాస తీర్మానాలపై కలెక్టర్లకు నిర్ణయాధికారం
- ఎన్నికల వేళ చర్చనీయాంశం
- జిల్లాలో నలుగురు చైర్మన్లు,ఒక వైస్ చెర్మన్‌పై నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లు
- ఏం జరగనుందోనని ఉత్కంఠ



గుట్ట మున్సిపల్ కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసును పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి, యాదాద్రి : కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలను సవాల్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పలు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడం చర్చనీయాంశమైంది. అవిశ్వాస తీర్మాన ప్రక్రియ కొనసాగుతుందని, ఇందుకు సంబంధించి కలెక్టర్లకు అధికారాలు ఇస్తూ న్యాయస్థానం తీర్పునివ్వడంతో ఏం జరగనుందోనన్న ఉత్కంఠ పాలకవర్గాల్లో నెలకొంది. జిల్లాలో భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ చైర్మన్లపై కౌన్సిలర్లు తొమ్మిది నెలల క్రితం కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో అవిశ్వాసంపై జోరుగా చర్చ సాగుతోంది.

చౌటుప్పల్‌లో.. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజుపై ఈ ఏడాది ఫిబ్రవరి 16న కౌన్సిలర్లు అప్పటి కలెక్టర్ పమేలా సత్పతికి అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. విపక్ష సభ్యులతో పాటు సొంతపార్టీ కౌన్సిలర్లు కూడా తిరుగుబాహుటా ఎగురవేశారు. మొత్తం 20 మంది సభ్యులకుగాను 15మంది నోటీసుపై సంతకాలు చేశారు.

- **యాదగిరిగుట్టలో..** మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధపై జనవరి 30న కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. కౌన్సిల్‌లో 12 మంది సభ్యులు ఉండగా 11 మంది అవిశ్వాసం నోటీసుపై సంతకాలు చేశారు. వీరిలో విపక్ష సభ్యులతో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కూడా ఉన్నారు.
- **ఆలేరులో..** మున్సిపాలిటీ కౌన్సిల్‌లో మొత్తం 12 మంది సభ్యులు ఉండగా 10 మంది మున్సిపల్ శంకరయ్యపై అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. వీరిలో 9 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉన్నారు.
- **భువనగిరిలో..** మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్యపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఫిబ్రవరి 7న అప్పటి కలెక్టర్‌కు కౌన్సిలర్లు నోటీసు అందజేశారు. కౌన్సిల్‌లో మొత్తం 35 మంది సభ్యులు ఉండగా 17 మంది అవిశ్వాస తీర్మానానికి మొగ్గు చూపారు.

ఎమ్మెల్యేలకు చిక్కులు

భువనగిరి, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే నాలుగు మున్సిపాలిటీల చైర్మన్లు, ఒక వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ విపక్ష సభ్యులతో సొంతపార్టీ సభ్యులు సైతం అప్పట్లో కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు. అనంతరం కొందరు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకోవడంతో ఇంతకాలం పాలన సాఫీగా సాగింది. కానీ, పిటిషన్లు కొట్టేయడంతో పాటు అవిశ్వాసానికి సంబంధించి కలెక్టర్లకు కోర్టు అధికారాలు ఇస్తూ తీర్పునివ్వడంతో పాలకవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అవిశ్వాసం తీర్మానాలపై కలెక్టర్ ఓటింగ్ పెడతారా.. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ సాగుతోంది. మొత్తంగా ఎన్నికల వేళ ఈ వ్యవహారం అధికార పార్టీ ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారే అవకాశం లేకపోలేదు.

ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు..

- మొదలైన వరి కోతలు
- ధాన్యంతో నిండిపోతున్న కేంద్రాలు
- కొనుగోళ్లకు సన్నాహాలు ప్రారంభించని అధికారులు
- ప్రైవేట్‌కు అమ్ముకుంటున్న రైతులు



రామన్నపేటలో వరి కోస్తున్న యంత్రం

రామన్నపేట : జిల్లాలో వరి కోతలు మొదలైనా ధాన్యం సేకరణకు అధికారులు సన్నాహాలు ప్రారంభించడం లేదు. ఇప్పటికే కొందరు రైతులు పంట నూర్పిళ్లు పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తున్నారు. తేమ కోసం ఎండలో ఆరబెడుతున్నారు. ఈసారి ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పినా ఇప్పటి వరకు వాటి జాడలేదు.

3,14,000 ఎకరాల్లో వరి సాగు

ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,14,000 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. గత వానాకాలంతో పోలిస్తే 15వేల ఎకరాల్లో అదనంగా సాగైంది. సుమారు 7లక్షల మెట్రిక్ టన్ను దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందులో స్థానిక అవసరాలకు పోను 3.50 లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా ఐకేపీ, పీఏసీఎస్, ఎఎంసీల ఆధ్వర్యంలో 272 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

నేరుగా మిల్లులకు

పండించడం ఒక ఎత్తయితే.. పండించిన పంటను అమ్ముకోవడం రైతులకు సవాలుగా మారుతోంది. కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం, కొర్రీలు పెట్టడం, వర్షాలకు తడుస్తుండడం, కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షించవలసి రావడం వంటి అనుభవాలతో కొందరు రైతులు నేరుగా మిల్లులకు తరలించి అమ్ముకుంటున్నారు.

ఏటేటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో ఏటేటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. 2021 వానాకాలం 2,76, 659 ఎకరాలు, 2022లో 2,99,776 ఎకరాలు, ఈ వానాకాలం 3,14,000 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. కాళేశ్వరం జలాలతో పాటు, మూసీ ఆధారిత కాలువలకు సమృద్ధిగా నీటిని వదలడం, భూగర్భ జలాలలు పెరగడం, ఉచిత కరంట్ వంటివి సాగు విస్తీర్ణం పెరగడానికి కారణంగా చెప్పవచ్చు.

కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలి



మా గ్రామంలో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం వరికోసి వడ్లను మార్కెట్‌లో పోసి ఆరబెడుతున్నాం. సీరియల్ 60కి వచ్చింది. ఆలస్యం చేయకుండా కొనుగోళ్లు ప్రారంభించాలి. ఆలస్యమైనా కొద్ది ఖర్చులు పెరుగుతాయి. రోజూ పనిచెడి తిరగాలి.

–కన్నెబోయిన వీరాంజనేయులు, రైతు, కక్కిరేణి

ఆదేశాలు రాలేదు

ధాన్యం కొనుగోళ్లకు ఐకేపీ, పీఏసీఎస్, ఎఎంసీల ఆధ్వర్యంలో 272 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. ప్రస్తుతం 35 లక్షల గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయి. మిగిలినవి సమకూర్చే పనిలో ఉన్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాలివ. దసరా తర్వాత ప్రారంభించే అవకాశం ఉంది.

–గోపికృష్ణ, డీఎం, సివిల్ సప్లయ్

కేంద్రాలకు ధాన్యం రాక



కక్కిరేణి కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

వరి కోతలు మొదలైన గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లకు ధాన్యం రాక మొదలైంది. కొన్ని చోట్ల ఇప్పటికే ధాన్యంతో నిండిపోయాయి. కానీ, ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో జిల్లా యంత్రాంగం కొనుగోళ్లకు సన్నాహాలు ప్రారంభించడం లేదు. కేంద్రాలకు మిల్లులను కేటాయించలేదు. కొనుగోళ్లు ఎవరు నిర్వహించలో కూడా ఇప్పటి వరకు నిర్ణయించలేదు. ధాన్యం దిగబడి అంచనా మేరకు 80 లక్షల గోనె సంచులు అవసరం కాగా ప్రస్తుతం 35 లక్షల బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. కొనుగోళ్లు ప్రారంభించే నాటికి మిగతావి సమకూర్చుతామని అధికారులు అంటున్నారు. తేమ యంత్రాలు, కాంటాలు సిద్ధం చేయవలసి ఉంది.

ఆరు గ్యారంటీలను ప్రతి గడపకు తీసుకెళ్లాలి



యాదగిరిగుట్టలో నిర్వహించిన బూత్ స్థాయి నాయకుల శిక్షణ తరగతుల్లో కాంగ్రెస్ నాయకులు

- కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ మానే

యాదగిరిగుట్ట : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను గడగడపకూ తీసుకెళ్లాలని కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మానే పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో శనివారం ఆలేరు నియోజకవర్గ స్థాయి బూత్ లెవల్ నాయకులతో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూనే.. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రచారం చేయాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందన్నారు. పేదలకు అన్ని రకాల పథకాలు చేరువ కావాలంటే కాంగ్రెస్ వస్తేనే సాధ్యమని, పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. అంతకుముందు బూత్ లెవల్ కార్యకర్తలు, నాయకులకు గాంధీ భవన్ ఎల్ఐసీ ఇన్సూరెన్స్ చైర్మన్ పవన్ మలాడీ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, బూత్ లెవల్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

మోటకొండూర్ : గ్రామాల నుంచి పట్టణాలకు చదువుకోవడానికి రాకపోకలు సాగించే విద్యార్థులు సరిపడా బస్సులు లేక, సకాలంలో రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవాలని ఆర్టీసీ బస్సుల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. గురువారం సాయంత్రం ముత్తిరెడ్డిగూడెం మీదుగా భువనగిరి వెళ్లే బస్సులో విద్యార్థులు ఫుట్‌బోర్డులో వేలాడుతూ ప్రయాణం చేయడం పలు రూట్‌లలో బస్సుల కొరతకు అద్దం పడుతోంది. బస్ సర్వీసులను పెంచడంతో పాటు విద్యా సంస్థల సమయానికి అనుగుణంగా నడపాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఫుట్ బోర్డులో వేలాడుతూ వెళ్తున్న విద్యార్థులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా సంక్షేమ పథకాలు అందుతాయని, ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం ఆయన భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. బీసీబంధు, మైనార్టీబంధు, గృహలక్ష్మి ఆర్థిక సాయాన్ని అర్హులకే అందజేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుల విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా అర్హుల జాబితాలు తయారు చేశామన్నారు.పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకు అనుగుణంగానే పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ వస్తేనే సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగు తా యని, వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు.

భవన నిర్మాణాలకు శంకుస్థాపన

సింగన్నగూడెం వద్ద లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంఘం భవనం, మార్కండేయ కమిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదే విధంగా బీఆర్‌ఎస్ అంబేద్కర్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన అంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు జిట్టా వేణుగోపాల్‌రెడ్డి, ఏవీ కిరణ్‌కుమార్, గోమారి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

భువనగిరి : నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేయాలన్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. అన్ని సౌకర్యాలు కల్పించి, విశాలమైన గదులతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు తెలిపారు. శనివారం భువనగిరి పట్టణ శివారులోని ఏకే ప్యాలేస్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్‌ఎస్ సర్కార్ పేదల కోసం పనిచేస్తుందన్నారు. అనంతరం దివ్యాంగులకు రెట్రో ఫిట్టెడ్ మోటోరైజ్డ్ బైక్‌లు, బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, వినికిడి లోపం ఉన్న మహిళలు, చిన్న పిల్లలకు పరికరాలు అందజేశారు.

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలి



మాసాయిపేటలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీత, చిత్రంలో ప్రజాప్రతినిధులు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్ : దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి సాయం అర్హులందరికీ అందుతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. శనివారం యాదగిరిగుట్ట మండలంలోని దాతర్‌పల్లి, మాసాయిపేట, గౌరాయపల్లి, సాధువెల్లి, కమతంగూడెం, ధర్మారెడ్డిగూడెం, బాహుపేటలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో గ్రామాలు అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశామని, పెండింగ్ పనులను కూడా పూర్తి చేసుకుందామని, మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. అర్హులందరికీ విడతల వారీగా పథకాలు అందుతాయని, ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతి, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, సర్పంచ్‌లు కర్రె వెంకటయ్య, వంటేరు సువర్ణ, కుండె పద్మ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు వంటేరు సురేష్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కవిడె మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు

- మురుగు నీరు ఇళ్ల మధ్య, వీధుల్లో చేరుతుంది
- పారిశుద్ధ్య చర్యలు మొక్కుబడిగా ఉన్నాయి
- దోమల నివారణకు ఫాగింగ్ చేస్తలేరు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో కమిషనర్‌కు ఆలేరువాసుల ఫిర్యాదు
- పరిష్కారానికి కృషి చేస్తామన్న కమిషనర్

ఆలేరురూరల్ : డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది.. కొన్ని చోట్ల అసలే డ్రెయిన్‌లు లేవు.. ఇళ్లలో వాడిన నీరు, వర్షపు నీరు ఇళ్ల మధ్య, వీధుల్లో చేరుతోంది.. పారిశుద్ధ్యం కూడా లోపించడంతో దోమలు బెడద అధికమవుతోంది. ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవని ఆలేరు పట్టణవాసులు వాపోయారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, డ్రెయినేజీలు, దోమల బెడద తదితర సమస్యలపై శనివారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజలు సమస్యలు ఏకరువుపెట్టారు. మున్సిపల్ కమిషనర్ చక్రపాణి సమస్యలు నోట్ చేసుకొని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు, కమిషనర్ సమధానం వారి మాటల్లోనే..

ప్రశ్న : చెత్త వాహనాలు వస్తలేవు. కూలిన ఇళ్లు, ఓపెన్ ప్లాట్ల మధ్య చెట్లు, పిచ్చి మొక్కలు పెరగడంతో ఇళ్లలోకి విష పురుగులు వస్తున్నాయి.

–రవికుమార్, 1వ వార్డు

కమిషనర్ : ప్రతి రోజూ చెత్తవాహనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య సిబ్బందితో చెట్లు తొలగిస్తాం.

ప్రశ్న : పందుల బెడద ఎక్కువగా ఉంది. మంతపురి రోడ్డులో వైన్స్ దగ్గర వాహనాలు బాటలో పెడుతున్నారు. –బాసెట్టి రమేష్, 7వ వార్డు

కమిషనర్ : పెంపకందారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. వైన్స్ వద్ద రోడ్డుపై వాహనాలు పెట్టకుండా చూస్తాం.

ప్రశ్న : రహదారి బంగ్లా వెనుకాల కాలనీలో డ్రెయినేజీలు లేవు. దోమల బెడద తీవ్రంగా ఉంది.

–ప్రసాద్, 10వ వార్డు

కమిషనర్ : డ్రెయినేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తాం. ప్రస్తుతం బ్లీచింగ్ చల్లిస్తాం.

ప్రశ్న : మోరీలు శుభ్రం చేస్తలేరు. చెత్తబండ్లు వస్తలేవు. విషజ్వరాలు వస్తున్నాయి.

–సుక్కరాజు, 10వ వార్డు

కమిషనర్ : మోరీలు శుభ్రం చేయిస్తాం. చెత్తబండ్లను పంపిస్తాం. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.



ఫోన్‌లో ప్రజల సమస్యలు వింటూ నోట్ చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ చక్రపాణి

ప్రశ్న : మా ఇంటి వెనుకాల మోరీ లేదు. మురుగు నీరు ఓపెన్ ప్లాట్‌లోకి చేరుతుంది.

–పేరవు సిద్దులు, 7వ వార్డు

కమిషనర్ : డ్రెయినేజీ మంజూరైంది.

ప్రశ్న : కాటమయ్యనగర్‌లో ఇళ్ల మధ్య, మోరీల వెంట గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచాయి.

–మొరిగాడి ఇందిర, 4వ వార్డు

కమిషనర్ : పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పిచ్చిమొక్కలు తొలగిస్తాం.

ప్రశ్న : చింతల్‌బస్తీలో డ్రెయినేజీలను శుభ్రం చేస్తలేరు.దుర్వాసన వస్తుంది. – సాయిరాం 4వ వార్డు

కమిషనర్ : ఓపెన్ డ్రెయినేజీలపై కప్పు నిర్మిస్తున్నాం. దోమల నివారణకు మందు పిచికారీ చేస్తాం.

ప్రశ్న : బృందావన్ కాలనీలో డ్రెయినేజీ నీరు బయటకి వస్తుంది. –సాయినాథ్, 4వ వార్డు

కమిషనర్ : మున్సిపల్ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : వెంకటరమణకాలనీలో డ్రెయినేజీల నిర్మాణానికి రోడ్డు తవ్వి వదిలేశారు. రాకపోకలకు ఇబ్బంది ఉంది. –కటకం నందం, 11వ వార్డు

కమిషనర్ : పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

ప్రశ్న : ఇళ్ల చుట్టూ, డ్రెయినేజీ పక్కన దట్టంగా పిచ్చి చెట్లు పెరిగాయి. దీంతో దోమల బెడద అధికంగా ఉంది . –రాంచందర్, 2వ వార్డు

కమిషనర్ : ఇళ్ల చుట్టూ, డ్రెయినేజీ పక్కన శుభ్రం చేయిస్తాం. బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తాం.

ప్రశ్న : సీసీ రోడ్డు లేదు. మోరీలను శభ్రం చేయకపోవడంతో మురుగు ముందుకెళ్లడం లేదు. కుక్కల బెడద ఎక్కువగా ఉంది.

–సురేష్, 1వ వార్డు

కమిషనర్ : సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాం. డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం. కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : రంగనాయకగుడి ఎదురుగా మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేశారు.

–జింకల రామకృష్ణ, 12వ వార్డు

కమిషనర్ : కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

ప్రశ్నం : శాంతినగర్ కాలనీకి వెళ్లే బాట పిచ్చి మొక్కలతో నిండిపోయింది.

–ఎండీ జహంగీర్, 10వ వార్డు

కమిషనర్ : కౌన్సిలర్‌తో మాట్లాడి మొరం పోయిస్తాం. త్వరలో సీసీ రోడ్డు నిర్మిస్తాం.

ప్రశ్న : చింతల్‌బస్తీ కాలనీలో నాలుగు ఇళ్లకు డ్రెయినేజీ సౌకర్యం లేదు. ఓపెన్ ప్లాట్లలోకి నీటిని వదలవలసి వస్తుంది. –ప్రవీణ్, 4వ వార్డు

కమిషనర్ : డ్రెయినేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తాం.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన ఇరగింద్ల ఇస్తారి(55), సురేష్ శుక్రవారం రాత్రి బైక్‌పై వెళ్తూ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఇస్తారి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన డీసీఎం

- ఇద్దరికి గాయాలు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి గ్రామం వద్ద వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై వాటర్ ట్యాంకర్‌ను వెనక నుంచి డీసీఎం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన రేపాక మహేందర్ రోజుమాదిరిగానే వాటర్ ట్యాంకర్‌తో రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న చెట్లకు నీళ్లు పోసుకుంటూ భువనగిరి నుంచి ఆలేరు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి వచ్చి ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న మహేందర్‌తో పాటు డీసీఎం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


రాయగిరి చెరువులో లభ్యమైన మృతదేహం

భువనగిరి క్రైం: భువనగిరి మండలంలోని రాయగిరి చెరువులో శనివారం గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరకుని అగ్నిమాపక సిబ్బంది సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహంపై గాయలేమి లేవని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టుబడిన ఇద్దరు దొంగలు

- బైక్‌ను వదిలేసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్న పోలీసులు, గ్రామస్తులు
- వారి వద్ద చోరీకి ఉపయోగించే పనిముట్లు లభ్యం


రాము, సారయ్యను వెంబడించి పట్టుకున్న పోలీసులు, గ్రామస్తులు


నిందితులు చోరీ చేసిన బైక్

అర్వపల్లి: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో ఇద్దరు దొంగలను స్థానికులు పట్టుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లిలోని జాజిరెడ్డిగూడెం రోడ్డులో కనుకు శ్రీనివాస్ అనే వ్యక్తి కొత్తగా నిర్మిస్తున్న ఇంటి పైనుంచి శనివారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు కిందికి దిగి వస్తుండగా ఇంటి యజమాని వారిని ఎవరు మీరు అని ప్రశ్నించాడు. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో స్థానికులు, పోలీసులకు శ్రీనివాస్ సమాచారం ఇవ్వగా వెంటనే పోలీసులతో పాటు గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. ‘ఇక్కడికి ఎందుకు వచ్చారు.. ఎవరు మీరు’ అని ప్రశ్నించగా, తమ బైక్‌ను అక్కడే వదిలేసి పారిపోబోతుండగా స్థానికులు వారిని వెంబడించారు. ఇద్దరు వ్యక్తులు గ్రామ శివారులోని ముత్యాలమ్మ గుడి సమీపంలో బోడబండ చెట్ల పొదల్లో దాక్కున్నారు. అర్వపల్లి గ్రామస్తులు, స్థానిక పోలీసులు రెండు గంటల పాటు శ్రమించి చెట్లపొదల్లో దాక్కున్న ఇద్దరిని పట్టుకుని విచారించగా.. తమ పేర్లు ఆర్. సారయ్య, బి. రాము అని, తమది పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామమని పేర్కొన్నారు. రెండు రోజుల కిందట తమ స్వగ్రామం నుంచి బయల్దేరి పరకాలలో రోడ్డు వెంట నిలిపి ఉన్న ఓ బైక్ తాళం పగులగొట్టి దానిని నడుపుకుంటూ శుక్రవారం రాత్రి అర్వపల్లికి వచ్చామని, ఈ ప్రాంతం తమకు కొత్త కావడంతో రాత్రంతా జాజిరెడ్డిగూడెం రోడ్డు వెంట కొత్తగా నిర్మిస్తున్న ఇంటిపై పడుకొని శనివారం ఉదయం లేచి వెళ్తుండగా స్థానికులు పట్టుకున్నారని వెల్లడించారు. తాము పగటి వేళ రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్నట్లు పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు పోలీసులకు తెలియజేశారు. వారి వద్ద ఉన్న బ్యాగును స్థానికులు తెరిచి చూడగా అందులో దొంగతనానికి ఉపయోగించే ఇనుప పైపు, కట్టర్, స్క్రూడ్రైవర్, నల్లటి దుస్తులు, కొన్ని ఇనుప పనిముట్లు కనిపించడంతో వాటిని పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తులు తీసుకొచ్చిన బైక్ ముందు, వెనుక నంబర్ ప్లేట్లు విరగ్గొట్టి బండి నంబర్ కనిపించకుండా చేశారు. వారిద్దరిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా అర్వపల్లిలో వారిద్దరు ఎలాంటి చోరీకి పాల్పడలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ

- కాంట్రాక్టర్ నుంచి రూ.80 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


ఏసీబీకి పట్టుబడిన పంచాయతీరాజ్ ఏఈ కొండేటి రమేష్

ఆలేరు రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పంచాయతీరాజ్ ఏఈ కొండేటి రమేష్ కాంట్రాక్టర్ నుంచి రూ.80వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం శారాజీపేట గ్రామానికి చెందిన ఐల శ్రీశైలం గ్రామ పంచాయతీ నిధుల ద్వారా సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులు చేస్తున్నాడు. పనులకు సంబంధించి ఎంబి రికార్డు చేయాలని పంచాయతీరాజ్ ఏఈ కొండేటి రమేష్ కోరాడు. అయితే, రూ.16 లక్షల పనులకు గాను 5 శాతం డబ్బులు 80వేలు ఇవ్వాలని ఏఈ రమేష్ డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ శ్రీశైలం.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శనివారం ఏఈ రమేష్‌కు కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైదరాబాద్ తార్నాకలోని ఏఈ రమేష్ ఇంట్లో సైతం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కాగా, ఎంపీడీఓ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడిచేసి ఏఈని పట్టుకోవడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. కొంతమంది అధికారులు కార్యాలయం నుంచి వెళ్లిపోయారు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

- భర్త ఐదేళ్ల క్రితమే వదిలేయడంతో అనాథలైన ఇద్దరు కుమార్తెలు


సత్యవతి (ఫైల్)


అనాథలైన చిన్నారులు

భువనగిరి క్రైం: మనోవేదనతో రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి పట్టణ శివారులో శనివారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో నల్ల సత్యవతి(48) తన ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటుంది. స్థానిక మదర్ థెరిస్సా స్కూల్‌లో పెద్ద కుమార్తె రిషిక 9వ తరగతి, నేహిత 8వ తరగతి చదువుతున్నారు. ఐదేళ్ల క్రితం ఆమె భర్త వదిలేసి వెళ్లిపోవడంతో భువనగిరి పట్టణానికి చెందిన ఓ లాయర్ వద్ద పనిచేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. సత్యవతికి అంగవైకల్యం ఉండటం, భర్త వదిలేసి వెళ్లిపోవడం, సొంత ఇల్లు లేకపోవడం, పిల్లల భవిష్యత్తుకు భరోసా లేకపోవడం, కుటుంబ పోషణ భారం కావడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె 8 పేజీల సూసైడ్ నోట్ రాసి శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భువనగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా శనివారం ఉదయం భువనగిరి శివారులోని జగదేవ్‌పూర్ రోడ్డులో రైల్వే ట్రాక్ వద్ద మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని మిస్సింగ్ కంప్లైంట్ ఆధారంగా సత్యవతి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తలకొరివి పెట్టిన చిన్న కుమార్తె..

భర్త వదిలేసి వెళ్లడంతో సత్యవతి భౌతికకాయానికి చిన్న కమార్తె నేహిత తలకొరివి పెట్టడం చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. తండ్రి లేక, తల్లి చనిపోవడంతో ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు.

నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు


పట్టుబడ్డ ఆటో, బెల్లంతో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది

హుజూర్‌నగర్: మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లోని హేమ్లాతండా, కప్పలకుంట తండా, దుబ్బతండాలలో నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్, సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు శనివారం హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగార్జునరెడ్డి విలేకరులకు తెలిపారు. అదేవిధంగా 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సారా తయారు చేస్తున్న హేమ్లాతండాకు చెందిన భూక్య బాలమ్మ, భూక్య సోమ్లా, భూక్య శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్‌ఐలు దివ్య, వెంకన్న, జగన్, మేళ్లచెరువు ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐ ఆనంద్‌నాయక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

200 కేజీల బెల్లం, ఆటో స్వాధీనం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట నుంచి మఠంపల్లి మండలం కొత్తతండాకు ఆటోలో బెల్లం తరలిస్తుండగా తండా శివారులో ఆటో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఆటో డ్రైవర్ భూక్య శంకర్ పారిపోగా ఆటోతో పాటు 200 కేజీల బెల్లంను స్వాధీనం చేసుకొని భూక్య శంకర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మామ ఖర్మకాండకు వెళ్తూ కోడలి మృతి


నాగలక్ష్మి (ఫైల్)

వలిగొండ: మామ ఐదో రోజు ఖర్మకాండకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం వలిగొండ మండలంలోని మాందాపురం సమీపంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రానికి అడ్డగుల్ల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రాములు కుమారుడు కిరణ్, కోడలు నాగలక్ష్మి(32) బతుకుదెరువు నిమిత్తం కొంతకాలం క్రితం వలిగొండ నుంచి వలస వెళ్లి బీబీనగర్ మండలంలోని రాఘవాపురంలో ఉంటున్నారు. శుక్రవారం రాములు ఐదు రోజు ఖర్మకాండకు హాజరయ్యేందుకు కిరణ్, నాగలక్ష్మి బైక్‌పై వలిగొండకు వస్తున్నారు. మార్గమధ్యలో మాందాపురం సమీపంలోకి రాగానే వీరి బైక్‌ను వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి రోడ్డుపై పడిపోగా ఆమె పైనుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కిరణ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా వారం రోజుల వ్యవధిలో మామ, కోడలు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కల్లుగీత కార్మికులకు రూ.5వేల పింఛన్ అందించాలి


మాట్లాడుతున్న బెల్లంకొండ వెంకటేశ్వర్లు

కోదాడ రూరల్: కల్లుగీత కార్మిలకు నెలకు రూ.5వేల పింఛన్ అందజేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేటలోని మార్కెట్ కమిటీ మీటింగ్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి 31వరకు నిర్వహించే కల్లుగీత కార్మిక సంఘం 66వ వార్షికోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 21 నుంచి 31 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ వార్షికోత్సవాలు జరపనున్నట్లు తెలిపారు. జిల్లాలో తాటి ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని నెలకొల్పాలని, గీత కార్మికులకు సెఫ్టీ మోకులు, ద్విచక్రవాహనాలు సమకూర్చాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎలుగూరి గోవిందు, కార్యదర్శి మడ్డి అంజిబాబు, ఉపాధ్యక్షులు అబ్బగాని భిక్షం, గుణగంటి కృష్ణా, కొండ అన్నపూర్ణ, జయమ్మ, నాగమల్లయ్య, తండా రమేష్, వెంకన్న, రామకృష్ణా, సిద్ధయ్య, సైదమ్మ, భద్రమ్మ, పిచ్చయ్య తదితరులు ఉన్నారు.

కల్వకుంట్ల కుటుంబానికి బుద్ధి చెప్పాలి

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన వేముల వీరేశం తదితరులు

నకిరేకల్ : కల్వకుంట్ల కుటుంబానికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని టీపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ కో చైర్మన్, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్‌ను గెలిపించుకునే సమయం ఆసన్నమైందని అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి ఖమ్మంకు వెళ్తూ నకిరేకల్ కొద్దిసేపు ఆగారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో కల్వకుంట్ల కుటుంబం డబ్బు సంచులతో వస్తుందని, ఆ డబ్బంతా పన్నుల రూపంలో మనం కట్టినదని, తీసుకోండి అని అన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ కాంగ్రెస్ పార్టీ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తే.. కల్వకుంట్ల కుటుంబం ఆ రోడ్డును కాంట్రాక్టర్లకు తాకట్టు పెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎవ్వరు ఉన్నా వారి హస్తం గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగనే ఆరు గ్యారెంటీ స్కీంలను అమలు చేస్తామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో 10కి 10, ఉమ్మడి నల్లగొండలో 12కు 12 సీట్లు గెలిచితీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని అందుకు ప్రజలు సహకరించాలని మిర్యాలగూడ డీఎస్పీ పి. వెంకటగిరి అన్నారు. శనివారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన కవాతులో ఆయన మాట్లాడారు. భద్రతపై ప్రజలకు భరోసా కల్పించడాని ఎస్పీ ఆదేశాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండర్ టిపి.భాఘెల్, సీఐలు పి.రాఘవేందర్, నరసింహారావు, సత్యనారయణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

బొమ్మలరామారం: విద్యార్థి దశలోనే సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్‌లో గల హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ కళాశాలలో శనివారం జరిగిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జూనియర్ ఇంటర్‌లోనే డిఫెన్స్, నేవీ, ఆర్మీకి సంబంధించిన కోర్సులను అదనంగా అభ్యసించడం గొప్ప అవకాశమన్నారు. విద్యుర్థులు క్రమశిక్షణతో టైంటేబుల్ రూపొందించుకొని ముందడుగు వేస్తే విజయ తప్పక వరిస్తుందన్నారు. అనంతరం పలు క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ కోరే రాజ్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి యాదయ్య, స్థానిక ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

మేళ్లచెరువు: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని శనివారం పోలీసులు పట్టుకొని అతడి వద్ద నుంచి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని ఓ సిమెంట్ పరిశ్రమలో కూలీలు నివసిస్తున్న షెడ్డులో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు గంజాయి విక్రయిస్తున్నట్లు స్థానిక యువకులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి గంజాయి పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు. అతడు గంజాయిని పొట్లాల రూపంలో కట్టి ఒక్కోటి వంద రూపాయలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతడికి గంజాయి ఎవరు చేరవేశారనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

మఠంపల్లి వాసికి ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగిగా అవార్డు


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ కర్ల శ్రీనివాస్‌కు ఉత్తమ ఉద్యోగిగా జోనల్ అవార్డు లభించింది. శనివారం ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అతనికి ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీ ఇబ్రహీంపట్నం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న అతను ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆర్టీసీకి అత్యధిక ఆదాయం తెచ్చినందుకు గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో ఉత్తమ ఉద్యోగిగా గుర్తించి అవార్డు అందజేశారన్నారు. కాగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీనివాస్‌ను అభినందించారు.

నిరుపేదకు సాయం అందించరూ..

- ఇంటి పెద్ద కిడ్నీలు చెడిపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబం
- వైద్యం కూడా చేయించుకోలేని దుస్థితి


మంచానికే పరిమితమైన వెంకన్న

కన్నీటి గాథ

మునగాల(కోదాడ): కూలి పని చేసుకొని జీవనం సాగించే ఆ కుటుంబానికి అనుకోని కష్టం వచ్చిపడింది. మునగాల మండల కేంద్రానికి చెందిన ఇరుగు కనకయ్య, రాములమ్మ దంపతుల మూడో కుమారుడు వెంకన్నకు భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించేందుకు ఏడాది క్రితం వెంకన్న హైదరాబాద్‌కు చేరుకొని చిన్నా చితక పనులు చేసుకుంటూ ఉన్నాడు. 9నెలల క్రితం అతడి రెండు కిడ్నీలు పాడయ్యాయి. దీంతో పాటు ఆయాసం, ఉబ్బసం లాంటి వ్యాధులు తోడయ్యాయి. బతుకుదెరువు కోసం హైదరాబాద్ చేరుకున్న వెంకన్న కుటుంబం వీధిన పడింది. రెండు కిడ్నీలు చెడిపోవడంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరాడు. ఈ క్రమంలో వారానికి రెండు సార్లు డయాలసిస్ చేయించుకోవడం వెంకన్నకు భారంగా మారింది. ఇప్పటి వరకు సుమారు రూ.7లక్షల వరకు ఖర్చు చేసినప్పటికీ వెంకన్న పూర్తిస్థాయిలో కోలుకోలేక మంచానికే పరిమితమయ్యాడు. అతడి భార్య నాగమణి హైదరాబాద్‌లోని ఇళ్లల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. వెంకన్నకు వైద్యం చేయించే స్తోమత లేక నాగమణి తన ఇద్దరు పిల్లలను బడి మాన్పించింది. ఇప్పటికే అందినకాడికి అప్పులు చేసి వెంకన్నకు వైద్యం చేయించిన నాగమణి ప్రస్తుతం ఎక్కడా అప్పు దొరకక దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. వెంకన్న మరికొన్ని రోజులు బతకాలంటే నిత్యం డయాలసిస్‌తో పాటు వైద్య చికిత్స అవసరం ఉందని డాక్టర్లు తేల్చి చెప్పడంతో అతడి భార్య నాగమణి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఎవరైనా దయార్ధ్ర హృదయులు ముందుకు వచ్చి సాయం అందించాని వేడుకుంటోంది.

దాతలు సాయం చేయాల్సిన వివరాలు..
ఇరుగు కనకయ్య
బ్యాంక్ అకౌంట్ నంబర్: 138410100025583
(యూనియన్ బ్యాంక్, మునగాల బ్రాంచ్)
ఫోన్ పే నంబర్: 8500918840

వైద్యానికి కూడా డబ్బులు లేవు



“దాతలు ముందుకు వచ్చి సాయం చేస్తే నా భర్త బతుకుతాడు. కనీసం నా కుటుంబాన్ని పోషించుకునే స్థితిలో కూడా నేను లేను. ఇళ్లల్లో పని చేయగా వచ్చిన డబ్బుతో ప్రస్తుతం నా భర్తకు వైద్యం చేయిస్తున్నాను.

– నాగమణి, వెంకన్న భార్య

జీవామృతంతో భూసారం పెంపు

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు


ఎం. రాజగోపాల రావు


రత్నవరంలో జీవామృతం తయారు చేస్తున్న రైతు

పాడి పంట

నడిగూడెం: ప్రస్తుతం వ్యవసాయంలో రోజురోజుకు మోతాదుకు మించి రసాయన మందులు వాడుతుండడంతో భూసారం దెబ్బతింటుంది. రైతులకు సరైన అవగాహన లేక రకరకాల రసాయన ఎరువులను భూమిలో చల్లుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రకృతి వ్యవసాయ పితామహుడు డాక్టర్. సుభాష్ పాలేకర్ రూపొందించిన జీవామృతం ఉపయోగించడం వలన భూసారం పెరుగుతుందని, దీంతో రైతులకు పెట్టుబడులు కూడా తగ్గుతాయని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు చెబుతున్నారు.

జీవామృతం తయారీకి కావాల్సిన పదార్థాలు

దేశీ ఆవు పేడ 10కిలోలు, దేశీ ఆవు మూత్రం 5 నుంచి 10 లీటర్లు, బెల్లం 2 కిలోలు, ద్విదళ పప్పుల పిండి 2 కిలోలు, బావి లేదా బోరు నీరు 200 లీటర్లు, పిడికెడు పొలం గట్టు మట్టి లేదా పుట్ట మట్టి.

తయారు చేసే విధానం

ఎండ తగలని చోట సిమెంట్ తొట్టి లేదా ప్లాస్టిక్ డ్రమ్ములో 200 లీటర్ల నీటిని నింపాలి. పేడ, మూత్రం, బెల్లం, పిండి తదితరాలను అందులో వేసి సవ్య దిశలో కర్రతో బాగా కలపాలి. ఆ తర్వాత దానిపై గోనె సంచి కప్పాలి. ఉదయం ఒక నిమిషం, సాయంత్రం ఒక నిమిషం కలియతిప్పాలి. అందులోని సూక్ష్మజీవులు ప్రతి 20 నిమిషాలకోసారి రెట్టింపు అవుతూ ఉంటాయి. 48 గంటల తర్వాత వాడకానికి జీవామృతం సిద్ధమవుతుంది. అనంతరం వారం రోజుల్లోగా దానిని ఉపయోగించాలి. ఎకరానికి 200 లీటర్ల జీవామృతాన్ని ప్రతి 15 రోజులకు ఒకసారి నీటితో పాటు వాడాలి లేదా భూమిలో పదునుంటే నేరుగా చల్లాలి. జీవామృతం అన్ని పంటలకు పొలాల్లోనూ వాడవచ్చు. పంటలపై పిచికారీ చేయవచ్చు.

జీవామృతం వాడటం వల్ల పంటల్లో అద్భుతమైన ఫలితాలు వస్తున్నప్పటికీ జీవామృతం పంటలకు లేదా చెట్లకు ఆహారం మాత్రం కాదు.

- జీవామృతంలోని సూక్ష్మజీవులు భూమిలో మొక్కల వేర్లు పోషకాలను వినియోగించుకునే రీతిలో మార్చి అందుబాటులోకి తెస్తాయి.
- ఆవు వేసిన 1 గ్రాము పేడలో 300 నుంచి 500 కోట్ల సూక్ష్మజీవులు ఉంటాయి. అంటే 10 కిలోల పేడలో 30 లక్షల కోట్ల నుంచి 50లక్షల కోట్ల వరకు సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- జీవామృతంలో 10 కిలోల పేడ కలిపిన తర్వాత ప్రతి 20 నిమిషాలకు వీటి సంఖ్య రెట్టింపు అవుతుంది.
- జీవామృతాన్ని తయారు చేసిన 2 రోజుల వరకు పులియపెట్టినప్పుడు వాటి సంఖ్య ఇంకా ఎక్కువ పెరుగుతుంది.
- ఎప్పుడైతే నీటిలో గాని తడి నేలపై గాని జీవామృతాన్ని పోస్తామో అప్పుడు అవి భూమిలోని పోషకాలను వేర్లు ఉపయోగించుకునే రూపంలోకి మార్చు పనిని ప్రారంభిస్తాయి.
- జీవామృతాన్ని భూమిలో పోసిన వెంటనే భూమిలో 10–15 అడుగుల లోతులో ఉన్న వానపాములు చైతన్యమై చురుగ్గా పనిచేయడం ప్రారంభిస్తాయి.